# రేగు పండ్లు



ఆ రోజు ఆదివారం. బడికి సెలవు.

స్వామి, శంకర్ ఇద్దరు పొద్దున్నే అడవికి వెళ్లారు. రేగు పండ్లు ఏరుకొచ్చి బండమీద పోశారు. పగటి భోజనం వేళ అయ్యింది. ఏరిన రేగు పండ్లను ఇద్దరు పంచుకోవడానికి బండమీద కూర్చున్నారు.

"శంకర్ నేను కొంచెం ఎక్కువ తీసుకుంటర"

"ఎందుకు"

"ఏరింది నేనుకదా"

"ఏరితే"

"ఏరేటప్పుడు వేళ్ళకు ఎన్ని ముండ్లు గుచ్చుకున్నా యనుకున్నావ్" స్వామి అన్నాడు.

"నాకు మాత్రం చేతులకు గుచ్చుకోలేదా. నీవు ఏరినంత సేపు నేను రేగుమండలను ఏరి పట్టుకోలేదా ?"

స్వామి పండ్లవైపే చూస్తు ఏదో ఆలోచిస్తున్నాడు.

"పండ్లని తొందరగ రాలాలని కట్టెతోటి చెట్టును కొట్టినప్పుడు రెండుసార్లు నా చొక్కాకు కంప తగిలింది తెలుసా"

"తగిలింది కాని చొక్క చినగలేదుగ"

"అంటే -" చొక్క చినగాలా అన్నట్టు చూశాడు శంకర్.

స్వామి మాట్లాకుండా ఏదో ఆలోచిస్తువున్నాడు.

"అత్యాశ మంచిదికాదు. పొద్దుటినుండి ఇద్దరం కష్టపడ్డాం చెరిసగం పంచుకుందాం"

"నాకు ఓ తమ్ముడున్నాడుర వానికి కొన్నిపెట్టాలె"

"నాకు ఓ చెల్లెవుంది గదర"

"చెల్లెకు పెట్టకున్న నడుస్తది"

"ఎందుకు చెల్లె పండ్లు తినదా"

స్వామి మాట్లాడలేదు.

"అందరం తింటాము. నీ వాటిల్లోనుండి నీవు తమ్మునికి పెట్టుకో. నేను నా వాటిల్లో నుండి నా చెల్లెకు పెట్టుకుంట. హు కాని, రెండు భాగాలు చెయ్యి".

"నీవే పంచు"

"అంటే పంచినవాళ్లు ఆఖర్న ఎత్తుకోవాలనా ?"

స్వామి నవ్వాడు. శంకర్ నవ్వుతూనే పండ్లను రెండు కుప్పలుగ పంచాడు.

"హు ఇగ ఎత్తుకో" అన్నాడు శంకర్.

స్వామి రెండు కుప్పలను పరిశీలనగ చూసి ఓ కుప్పను ఎత్తి జేబులో నింపుకున్నాడు.

మిగిలిన వాటిని శంకర్ ఎత్తుకున్నాడు. ఇద్దరు ఊరివైపు నడుస్తున్నారు.

ఊరి పక్కమ్మటే ఓ చింతచెట్టుంది. ఆ చింత చెట్టు కింద ఒక గుడ్డి ముసలమ్మ కూర్చోని వుంది. అక్కడికి కొంత దూరంలో ఇసుకలో పిల్లలు ఆడుకుంటున్నారు. వీళ్లరాకను శబ్దం ద్వారా గుర్తించిన ముసలమ్మ "ఎవరు, రేగు పండ్లకు పొయ్యొస్తున్నర" అంటు అడిగింది. స్వామి చప్పుడు చేయలేదు. శంకర్ "అవును అవ్వ" అన్నాడు.

"ఏది రెండు పెట్టిపొతాత" అంది.

స్వామి చప్పుడు చేయలేదు.

"పుల్లపుల్లగ వుంటాయి గద తినబుద్ధి అయితుంది. రెండు పెట్టి పొండ్రి" అంది.

శంకర్ తన జేబిలోనుండి కొన్ని తీసి ముసలమ్మ చేతిలో వుంచాడు.

"చాలు బిడ్డ, చాలు సల్లగ బతుకు" అంది.

శంకర్ వడివడిగ నడిచాడు స్వామిని కలిశాడు.

"నేను రెండు ఎక్కువ తీసుకుంట అంటె ఒప్పుకోలేదుకదా ?"

"అవును"

"మరి ముసలమ్మకు ఎందుకు పెట్టినవ్ అంటవ్ ?" అన్నాడు శంకర్. అవునన్నట్టు చూశాడు స్వామి.

"అరె ఆమె నడవలేదు. పోగ గుడ్డిది. మనం వస్తున్న చప్పుడు పట్టే రేగుపండ్లు తెస్తున్నం అని గుర్తుపట్టింది."

"గుర్తుపడితే పెట్టాలని వుందా ?"

"నీకు లేదేమో లేవలేని ముదుసలి కనుక నాకు పెట్టాలని పించింది పెట్టిన".

"ఇకనుండి నీ వెంటరానులే"

"రాకుంటే మానెయ్ గాని నీవు కొంత మారాలిర."

స్వామి ఓ మాదిరిగ శంకర్‌వైపు చూశాడు.

"అవును మనకు రావల్సినంతే మనం కోరుకోవాలి. ఈ పండ్లు ఎక్కువ రోజులున్న పాడైపోతవి కనుక మంచిగున్నప్పుడే మరొకరికి పెడితే వాళ్లు అవి పాడుకాక ముందే తింటారు కదా ?" అన్నాడు. అంతలో తన యిల్లు రాగానే శంకర్ యింట్లోకి నడిచాడు.

స్వామి ఆలోచిస్తు ఇంకా కొంచెం ముందున్న తనయింటి వైపు నడిచాడు.

●